

# దొరైకన్ను

గొల్లపూడి మారుతీరావు

తుఫాను. పదిరోజులుగా వర్షం ముమ్మరంగా కురుస్తోంది. శనివారంనాటికి ఏమయినా తిరపతి వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు విష్ణుమూర్తి. భార్య కమలకీ, పిల్లలకీ తిరపతి వెళ్ళాలని వుంది గాని— వర్షం ఉధృతం చూస్తే భయమేసింది. పిల్లల్తో కారులో భద్రంగా చేరగలమాని ఆవిడ భయం. కారు కొనడానికికొత్తగాని, పదేళ్ళ పాతది. ముప్ఫై ఏళ్ళదాన్ని పెళ్ళికూతురులాగ అలంకరించినట్టు చూడడానికి గుంభనంగా నిండుగా వుంది. కాని కమలమ్మకి భయమే. దానికి తోడు విష్ణుమూర్తి పేకాటమిత్రుడు త్రివిక్రమరావు, అతని భార్య పార్వతి, ఆరేళ్ళ కొడుకు అంజిబాబు — వీళ్ళుకాక ఆదినారాయణ డ్రైవరు. ఇదీ బృందం. త్రివిక్రమరావు నుదుటిమీదే భారతీయ మత సామరస్యం కనిపిస్తుంది. శివకేశవులు భేదం లేకుండా అందరినీ నుదిటికి ఎక్కించుకున్న పుణ్యాత్ముడు త్రివిక్రమరావు. ఆదినారాయణ నోరిప్పితే భారతీయ కర్మజీవనం గుప్పుమంటుంది. వీలయినంతవరకు కల్లు తాగకుండా శరీరాన్ని ఉంచకపోవడం వాడి జీవిత లక్ష్యాలలో ఒకటి. కాని వాడు మహా భక్తుడు. ఏడుకొండలవాడి పేరు చెప్తే భక్తితో కళ్ళలో నీళ్ళు వచ్చేస్తాయి.

“బగవంతుడంటే మరాలేనండి. నాను పుట్టినకాడనుంచీ అరిమిదే నా యిస్వాసం–” యిదే వాడి ధార్మిక జీవనానికి పట్టుకొమ్మ. కమలమ్మకి భగవంతుడి మీదకంటె భర్తమీద, మతం మీదకంటె కన్నపిల్లలమీద మమకారం ఎక్కువ. వాళ్ళకి జరిగే, జరగాల్సిన మేలుదృష్ట్యా ఆవిడకి అవసరార్థం వెంకటేశ్వరుడు, కరుమారియమ్మ — యిలా ఎవరయినా పరవాలేదు. కాని ఉద్దేశం మంచిది కనక — జరిగే ఉపకారం అయా దేవుళ్ళని బట్టి జరుగుతుందని నమ్మిక.

పోతే పార్వతమ్మకీ, విష్ణుమూర్తికీ కొన్ని పోలికలున్నాయి. ఇద్దరూ వ్యక్తి స్వతహాగా చేసే కృషిమీద నమ్మకం ఉన్నవారు. ఆ అవసరం ఉన్నవారు, దేవుడిని నమ్ముకునే తీరుబాటు — ఆ విశ్వాసంతో నిద్రపోయే అదృష్టం లేని వాళ్ళు, కాగా పార్వతమ్మ విగ్రహం ముందు నిలబడినప్పుడయినా దైవం గురించి ఆలోచిస్తుందేమోగాని, విష్ణుమూర్తికి—ఆ విగ్రహంమీద పువ్వులతో వ్యాపారానికో, ప్రసాదాన్ని టోకుగా తయారుచేయించే కాంట్రాక్టు మీదకో, దేవుడి ఫోటోలను ప్రింటు చేయించే బిజినెస్‌మీదకో దృష్టిపోతుంది. ఏకాగ్రత కుదిరే ఏ విషయంలోనయినా దైవత్వం ఉన్నదనీ, అలాంటి ‘ఏకాగ్రతకి పరాకాష్ఠే దైవం’ అని అతని అభిప్రాయం. అలాకాక దొంగపూజారి పిచ్చి కేకలకి—చెమటతోతడిసిన భక్తుల నిమీలిత నేత్రాలకి మురిసిపోయి దేవుడు — ఆ చీకటి గుయ్యారంలో విడిది చేసి ఉండడని అతనికి పూర్తినమ్మకం.

పెళ్ళయినప్పటినుంచీ అతని విశ్వాసాన్ని సడలించాలని కమలమ్మ శతధా ప్రయత్నంచేసి వీగిపోయింది. విష్ణుమూర్తికి దేవుడిమీద భక్తిలేదు కాని, కమలమ్మమీద ప్రేమ వుంది. అందువల్ల ఎవరి విశ్వాసాలను వాళ్ళు గౌరవించడానికి ఒక ఒప్పందానికి వచ్చారు.

మరి యిప్పుడు విష్ణుమూర్తి తిరపతి ఎందుకు బయలుదేరాడు? తిరపతిలో మోపెడ్స్ కంపెనీకి సంబంధించిన ఏవో పరికరాల వ్యాపారంగురించి చర్చలు జరపడానికి బయలుదేరాడు. ఇది ఇటీవల అతను తరుచు చేసే ప్రయాణం. తిరపతి

అనగానే విష్ణుమూర్తికి - బోడిగుళ్ళు, గంధంవాసనా, మిషన్‌పార్టులూ, ఇనుప సామాన్లు, వ్యాపారం లావాదేవీలు గుర్తుకొస్తాయి - కాని కమలమ్మకి శ్రీనివాసుడు, అలివేలుమంగ, బంగారు కోనేరు యిలాంటివి జ్ఞాపకం వస్తాయి. త్రివిక్రమరావు పేకాటలో ఎప్పుడు రెండువేలకి ఎక్కువ ఆటకొట్టినా కొండ కొచ్చి గుండు చేయించుకోవడం అనవాయితీగా పెట్టుకున్నాడు. ఆ శ్రీనివాసుడు పేకాటలో ఎదుటివాళ్ళని ఓడించి తద్వారా ఆదాయం పెంచడమే అతని జీవితాశయం, కోరిక. త్రివిక్రమరావుకి మరో ఉద్యోగం, వ్యాపారంలేదు. ప్రతిరోజూ మల్లెపూవులాంటి తెల్లధోతీ, లాల్చీ వేసుకొని, కిళ్ళీ బనాయించి, వేదాంత పరిజ్ఞానంతో పండి ముదిరిన మేధావిలాగ -నిశ్చలమయిన మనస్సుతో, నిలకడయిన బుద్ధి సూక్ష్మతతో, రెండు పదిరూపాయల నోట్లు మడతలతో క్లబ్బుకి చేరుతాడు. అక్కడి ఆదాయమే అతనికీ, కుటుంబానికీ శ్రీరామరక్ష.

ఈ విధంగా దేవుడిమీద, జీవితం మీద, జీవనసరళిమీద విభిన్నమయిన అభిప్రాయాలుగల వ్యక్తులు-ఒకకారులో చేరి తిరపతి బయలుదేరిన సందర్భంలో కుండపోతగా వర్షం, తుఫాను రావడంలో ఆశ్చర్యంలేదు.

అప్పటికి పదిరోజులుగా వూరూ ఏరూ ఏకమయిపోతున్నాయి. నగరంలో వర్షంతాకిడితప్ప జరిగేనష్టం అంతగా తెలీకపోయినా - వూరు దాటేసరికి కారు కాగితపు పడవలాగ నీటి చెలమల్లో ఊగిసలాడింది.

కారు నడుస్తున్నంత మేరా వెలిసి పోయిన రంగు చిత్రంలాగ - యిళ్ళు, మేడలు - నీటిలో తడిసి ముద్దయిపోతూ నిశ్చలంగా తపస్సు చేస్తున్న ఋషుల్లాగ నిలబడిన ఆవులు -

"గురువుగారూ! కొండమీద ఏమయినా నాలుగుగంటలు ఆటవెయ్యాలి," అంటున్నాడు త్రివిక్రమరావు.

"ఇక్కడా యీ పాడు ఆట వదిలి పెట్టరా?" అని కసురుకుంది పార్వతమ్మ. విష్ణుమూర్తి నవ్వాడు. ఆయన్ని తిట్టకండి. ఆయనకి ఆట వృత్తి - నాలాంటి వాళ్ళకి వినోదం. కొండమీద భగవంతుడి సమీపంలో తన ప్రతిభకు మెరుగులు దిద్దుకోవాలని తాపత్రయం" అని త్రివిక్రమరావు వేపు తిరిగి-

"మై డియర్ సర్! నేను తిరపతి వచ్చేది దేవుడికోసం కాదు. - డబ్బు కోసం."

"మొక్కుకుంటే అది దేవుడే యిస్తాడు."

"పాపం, ఆయనకి మీలాంటి వాళ్ళకి యివ్వడానికే చాలడంలేదు - ఎంతకని సంపాదిస్తాడు - నా తంటాలు నేను పడతాను."

"నోర్మూయ్యండి. కొండమీదకి రాక పోయినా దేవుడిని అంతలేసి మాట లనకండి," అంది కమలమ్మ.

పార్వతమ్మ మాత్రం ఫక్కున నవ్వింది.

కారు పచ్చని పొలాల మధ్యనుంచి వెళ్తోంది. అంతా నిర్మానుష్యం. ఉన్నట్టుండి విష్ణుమూర్తికి కారు నడపాలని సరదాపుట్టింది. కారు పార్టుల వ్యాపారం, స్కూటర్ పార్టుల వ్యాపారం చేస్తాడే కాని విష్ణుమూర్తికి కారు నడపడం రాదు. ఆ విషయం ఆదినారాయణకి తెలుసు. కారు మద్రాసు దాటినప్పటినుంచి స్టీరింగు యివ్వమని ఒకటే పోరుతున్నాడు. వర్షం ఎక్కువగా వుందనో, రోడ్డు బాగులేదనో, మనుషులున్నారనో తప్పించుకొస్తున్నాడు ఆదినారాయణ. యిప్పుడు మళ్ళీ అడిగాడు విష్ణుమూర్తి. కారు అతనిది. కారణాలు అంతగా కనిపించలేదు. "నోరు మూసుకు పక్కకి జరుగు" అని కసిరినా డ్రైవరు చెయ్యగలిగింది లేదు. మర్యాదగా కారాపాడు త్రివిక్రమరావు నవ్వుతున్నాడే కాని కమలమ్మకి యిబ్బందిగానే వుంది. "గడ్డు రోజున బయలుదేరాం. మళ్ళీ మీ చెయ్యి ఎందుకు? వాడినే నడపనివ్వండి," అని చెప్పినా విష్ణుమూర్తి వినిపించుకోలేదు.

స్టీరింగు ముందు కూర్చొని బండిని స్టార్టుచేసి గేరులోకి మార్చాడు - అంతే. తాప్పున ఏక్సిల్ విరిగిపోయింది. ఆదినారాయణ గతుక్కుమన్నాడు. కారు యింక అడుగుకూడా కదలదు. కొత్త పార్టు కొనాలి. ఆ సమీపంలో దొరకవు. మెకానిక్‌ని తీసుకొచ్చి పని చేయించాలి.

"కొంప ముంచారు సార్" అన్నాడు ఆదినారాయణ.

కమలమ్మ ఒకటే గోల - ఏ నోటితో అన్నానో వద్దని - చెయ్యిపెట్టారు, ప్రయాణం ఆగిపోయింది" అని.

అంతా కారు దిగారు. కష్టంవస్తే త్రివిక్రమరావు మనిషికాదు. ఉద్యమం. అంతవరకూ అతనిలో ఉన్న నజ్ఞతనం ఎక్కడికి పోతుందో-"మరేం ఫరవాలేదు సిస్టర్ - నేనున్నాగా! - ముక్క కలవనప్పుడే దమ్ము కావాలి - ఒరేయ్ ఆదినారాయణా!లారీలో తిరుత్తణి వెళ్దాం. సామాన్నీ, మెకానిక్‌నీ తీసుకొస్తాం - అంతా మహాఅయితే మూడుగంటలపని" అన్నాడు.

జరిగేపని ఎంత క్లిష్టమయినా, జరగడాన్ని అంత సుళువుగా ఊహించడం, జరుపుతానని ఒక మనిషి చెప్పడంతో - అందరికీ ప్రాణం లేచివచ్చింది. మళ్ళీ చిన్న తుంపర ప్రారంభమయింది. మరో గంటలో చీకటి పడుతుంది. అప్పటికే ముసాబుగా వుంది.

అయిదునిముషాల్లో లారీ ఆపి ఎక్కేశారు త్రివిక్రమరావు, ఆదినారాయణ. ఆడవాళ్ళకి, పిల్లలకి, కారుకి కాపలాగా విష్ణుమూర్తి నిలబడ్డాడు. కారు దిగి చెట్టు కింద నిలబడి - సిగార్ వెలిగించాడు.

కారు నడుస్తున్నప్పుడు తెలియని స్తబ్ధత చీకటి పడకుండానే అక్కడా అక్కడా కప్పల బెకబెక, చీకటి పడకుండానే — చీకటి పెట్టే భయం ముందుగా ముసురుకొన్నట్టు అనిపించింది.


"ఏమండీ! నగలతో, పిల్లలతో ఒంటరిగా వున్నాం-ఎవడయినా పొడుస్తే" అంది భయంగా కమలమ్మ.

పార్వతమ్మ మాత్రం, దొంగలకి భయపడలేదు గాని, చీకటికి భయపడింది. రాబోయే అపాయానికి భయపడడం కమలమ్మ స్వభావం. అపాయం ఏమిటో తెలుసుకోలేని అవ్యవస్థకి భయపడటం పార్వతమ్మ స్వభావం. కమలమ్మది పిరికితనం, పార్వతమ్మది ముందు జాగ్రత్త.

విష్ణుమూర్తికి యీ రెండూ పట్టవు. కష్టం మీద పడేదాకా పడుతుందని నమ్మడు. పడ్డాక — సాధించ లేకపోయే వరకు సాధించలేనని నమ్మడు. అతను బతికేది ఇమ్మీడియట్ వర్తమానంలో. అందుకే నదురూ, బెదురూ లేకుండా భార్య మాటలకి చిరునవ్వునవ్వి మైలురాయిమీద కూర్చుని — సిగార్ పొగ వదులుతున్నాడు.

ఇదిగో సరిగ్గా ఈ సమయంలో కనిపించాడు దొరైకన్ను. పంచె మీదకి ఎగగట్టి — పొలాల మధ్య హఠాత్తుగా ఓ మనిషి బయటికొచ్చాడు. మొదట ఓ సైకిలుని ఒడ్డెక్కించి నీళ్ళలోంచి తను రోడ్డుమీదకు వచ్చాడు. హఠాత్తుగా చూస్తే- ఉన్నట్టుండి ఆ సంధ్యవేళలో కిందటి వరకు కనిపించని మనిషి - ఎదురుగ్గా వచ్చేసరికి అంతా గతుక్కుమన్నారు.

కాని భయపడవలసినంత గంభీరమయిన విగ్రహంకాదు అతనిది. పొగాకు తరచు నమలడంవల్ల - ముందు రెండు పళ్ళు పారల్లాగ తయారయి - ఏటవాలుగా తెగిపోతున్నాయి. జుత్తు సగం పండింది. సన్నగా, బలహీనంగా - 45



ఏళ్ళుంటాయి. వాళ్ళు ఆశ్చర్యంనుంచి తేరుకునేలోగానే కారు దాటి వెళ్ళిపోయాడు సైకిలుమీద. కనుమరుగు కాగానే - ఆలోచనల్లోంచి బయటికి తోసేశాడు విష్ణుమూర్తి. కాని మరో రెండునిముషాల్లో సైకిలు నడిపించుకొంటూ వెనక్కి వచ్చాడు దొరైకన్ను.

"కారు చెడిందా అయ్యా" అన్నాడు నవ్వుతూ - నవ్వు - కారు చెడినందుకు ఆనందమో, విష్ణుమూర్తిపట్ల గౌరవమో అర్థంకాలేదు కాని వొళ్ళుమండుకొచ్చింది.

"చెడితే నీకేం?" అన్నాడు విష్ణుమూర్తి కఠినంగా.

దొరైకన్ను బాధపడినట్టు కనిపించలేదు. పళ్ళు కనపడేలాగా నవ్వి "నాకేం లేదుకాని, దగ్గర్లో కల్లంగడి వుంది. ఆ మర్రిచెట్టు దాటితే ఆంధ్ర. అక్కడ తాగి తూలుతూ పేలుతూ యిటు వస్తూంటారు. ఆడవాళ్ళు, పిల్లలూ ఉన్నట్టున్నారు. జాగ్రత్త సార్" అన్నాడు.

ఆ మాటలకి విష్ణుమూర్తి కాస్త కదిలాడు. కమలమ్మ అయితే కారు దిగి వచ్చింది. వెంటనే పార్వతమ్మ దిగింది.

"ఏమండీ - ఎందుకయినా మంచిది. దగ్గర్లో ఎక్కడయినా కూర్చోవచ్చునేమో అడగండి. కారులో ఉండాలంటే భయంగా వుంటుంది," అంది.

"నేనున్నాగా - మరేం భయంలేదు," అన్నాడు విష్ణుమూర్తి. ఆ మాటల్లో ధైర్యంకంటే పిరికితనం వుంది. అలవాటయినవాడికి రోజూ సముద్రంలోకి వెళ్ళడం దినచర్య. కాని కొత్తవాడికి ప్రత్యేకమయిన ప్రయత్నం.

"పోనీ అతన్నయినా ఉండమనండి" అంది కమలమ్మ.

విష్ణుమూర్తికంటె ఏ విధంగా చూసినా దొరైకన్ను సన్నగా, పీలగా వున్నాడు. అతనితో పోల్చిచూస్తే విష్ణుమూర్తి వస్తాదుకింద లెక్క. కాని తెలిసిన వాతావరణంలో బలం శరీరానిది కాదు. మనస్సుది. అక్కడ, అప్పటికి దొరైకన్నే బలవంతుడు. ఏమయినా మరో ఆడది (పార్వతమ్మ) ఎదురుగా ఉండగా బలహీనుడిని సాయం ఉండమని అడగడానికి మనస్కరించలేదు విష్ణుమూర్తికి.

పార్వతమ్మ చాలా తెలివైనది. "మనిషికి మనిషి సాయం. ఈ ప్రాంతం

మనిషేకదా! ఉండమనండి. కావాలంటే రూపాయో రెండో యిచ్చి పంపేద్దాం," అంది.

తన పిరికితనానికి మరో అందమయిన పేరు పెట్టినందుకు విష్ణుమూర్తి ఆనందపడి దొరైకన్నువేపు చూశాడు.

దొరైకన్ను అన్నిటినీ అర్థం చేసుకున్న వేదాంతిలాగ నవ్వాడు.

"ఇప్పట్లో మీరు వెళ్ళమన్నా వెళ్ళను సార్. తిరపతి వెళ్ళే యాత్రికులకి సహాయంచేస్తే నాకు పుణ్యం వస్తుంది. మీ మనుషులు వచ్చేదాకా యిక్కడే ఉంటాను" అంటూ సైకిలుని చెట్టుకి ఆన్చి మైలురాయిమీద కూర్చున్నాడు.

విష్ణుమూర్తి కాస్త చికాకుపడ్డాడు, తన ప్రయత్నం లేకుండానే వాడు ఆగినందుకు.

"నీ పుణ్యం, పాపం అక్కరలేదు. రెండు రూపాయలు యిస్తాలే," అన్నాడు. ఆడవాళ్ళు - ముఖ్యంగా పార్వతమ్మ వినేలాగ.

దొరైకన్ను తీరుబాటుగా జేబులోంచి బీడీ తీసి వెలిగించాడు. చిరునవ్వునవ్వి — "ఆ దూరాన కనిపించే వేపచెట్టు చూశారా సార్ - దానికి యిటువేపు ఉన్న 15 ఎకరాల మాగాణి నాది సార్-నా స్థిరాస్థి, చరాస్థీ- అంతా కలిపి 50 వేలుంటుంది," అన్నాడు.

విష్ణుమూర్తి నిర్ఘాంతపోయాడు.

"నన్ను రెండుసార్లు పాము కరిచింది సార్. నా చిన్నప్పుడు మా అయ్యతో కౌతారం పొలంగట్టున నడుస్తున్నప్పుడు- మూడురోజుల తర్వాత తెలివొచ్చింది. అంతకుముందు దబ్బపండులాగ తెల్లగా ఉండేవాడినంటారు. ఆ తర్వాత నల్లగా అయిపోయానట. అమ్మ చెప్పింది. రెండో సారి యిదిగో - యీ పొలాల్లోనే అయిదేళ్ళనాడు కరిచింది. చీకట్లో — కరిచిందేదో తెలీకపోయినా కరిచినచోటున వేలిని పట్టుకొని ఆలోచించకుండా కొడవలితో నరికాను. చూశారా సార్. కుడి కాలికి బొటనవేలులేదు." చూపించాడు.

"బతకడానికి కావాలసినంత డబ్బు, చావకుండా బతకడానికి కావలసినంత గుండెధైర్యం - రెండూ ఉన్నాయి నా దగ్గర," అన్నాడు.

పార్వతమ్మ ముఖంలో ఆశ్చర్యం. విష్ణుమూర్తి ముఖంలో దిగ్భ్రమ ద్యోతకమయింది.

"పుణ్యం డబ్బుకంటె విలువయినది సార్. అది సంపాదించుకోడానికి మీరు తిరపతి వెళ్తున్నారు. నేను ఈ 20 ఏళ్ళలో రెండుసార్లే తిరపతి వెళ్ళగలిగాను."

"ఏం?"

"నేను లేకపోతే మా పాపకి అన్నం పెట్టేవాళ్లెవరూ లేరుసార్. దానికి 14 ఏళ్ళు. దేవకన్యలాగ వుంటుంది. మా పాప అంత అందమయినవాళ్ళు సృష్టిలో చాలా తక్కువమంది ఉంటారు సార్. అలాగే మా పాప అంత దురదృష్టవంతులు వుండరేమోకూడా." అతని కళ్ళలో నీళ్ళు కదిలాయి.

"బీడీ కాలుస్తారా?" అన్నాడు ఆగి.

ఈపాటికి ఆడవాళ్ళు దిగారు కారు. అతని మాటలు వింటూ చెట్టుకిందకి చేరారు.

"నీ బిడ్డకేం బాబూ?" అంది కమలమ్మ.

"పోలియో అమ్మగారూ! కాళ్ళు బొత్తిగా పనిచెయ్యవు. మా ఆడది చచ్చిపోయి పదేళ్ళయింది. నాలుగేళ్ళ పాపగా ఉన్నప్పట్నుంచి అమ్మాయిని నేనే పెంచాను. మరొకళ్ళు దానికేం చేసినా ఒప్పుకోదు. ఆడవాళ్ళు మీ కా బాధలు తెలుసు. 14 ఏళ్ళ ఆడపిల్లకి — అన్ని పనులూ — నేను ఎలా చేసిపెట్టను."

ఉన్నట్టుండి మాట మార్చాడు. "మీ వాళ్ళు తిరిగొచ్చాక కారుకింద పనిచెయ్యడానికి దీపంకావాలి. బాటరీ లైటు ఉందా సార్?" అన్నాడు.

విష్ణుమూర్తి తుళ్ళిపడ్డాడు. ఆ ఆలోచనే అంతవరకు తట్టలేదు. అప్పటికే పడమటి ఆకాశం మూసుకుపోయింది. మెకానిక్ వచ్చినా, స్పేర్ పార్ట్సు వచ్చినా - దీపం లేనిదే గంటన్నరసేపు పట్టే పని తెల్లవార్లూ చేసినా జరగదు.

"ఇబ్బందేనే! ముందుగా గుర్తొచ్చివుంటే ఓ బ్యాటరీలైటు కొని తెమ్మనేవాడిని," అని నొచ్చుకున్నాడు విష్ణుమూర్తి.

"అదే సార్ జీవితం — ముందుగా తెలిసివుంటే నేను పెళ్ళి చేసుకోకపోయేవాడిని"-ఉండండి. అక్కడ నా పాకలో పాత బ్యాటరీలైటుండాలి. బ్యాటరీలు మాత్రం లేవు. చూసివస్తాను."

"మీ కెందుకా శ్రమ?" అని పార్వతమ్మ నోటిదాకా వచ్చింది కాని-ఆ శ్రమనుంచి దొరైకన్నుని కాపాడితే రాత్రంతా తాము శ్రమపడాల్సి వస్తుందని ఆగిపోయింది.

దొరైకన్ను సైకిలుతో పొలాలమధ్య మాయమయాడు. మరి అరగంటవరకు అతని జాడలేదు.

"కొంపతీసి అతనే తాగిరాడు కదా!" అని సందేహించింది కమలమ్మ.

"అసలు వస్తాడన్న నమ్మకంలేదు. బ్యాటరీలైటు తెస్తే రెండు గంటలసేపు యిక్కడ యిరుక్కొంటాడు. తెలివైనవాడయితే అటునుంచి అటే తప్పించుకుపోతాడు," అన్నాడు విష్ణుమూర్తి.

కాని విష్ణుమూర్తి వూహించిన తెలివితేటలు దొరైకన్నుకి లేవు. మరో పదిహేను నిముషాలకి వచ్చాడు.

"భ్యాటరీలైటు దొరికింది సార్. మా అమ్మాయికి నామీద కోపంవచ్చి చిన్నప్పుడు నేలకేసి కొట్టింది. వెనక లొత్త పడింది. బ్యాటరీలు లేవు. ఊళ్ళోకి వెళ్ళి కొనుక్కు వచ్చేసరికి ఆలస్యమయింది.

అతన్ని చూసి ముగ్గురూ నిర్ఘాంతపోయారు. ఏదో తెలియని ప్రత్యేకత దొరైకన్నులో వారికి కనిపించింది.

ఊహించని చోట ఔదార్యం లభించడం అనుమానాస్పదమే అవుతుంది, ఒక్కొక్కప్పుడు — మరి కాస్సేపటికి లారీ లోంచి ఆదినారాయణ, త్రివిక్రమరావు దిగారు మెకానిక్‌తో. పెళ్ళిలో పురోహితుడు అతి మామూలుగా మంగళ సూత్రం అడిగినట్టు "బాటరీలైటు ఏది సార్?" అని అడిగి మెకానిక్ వెంటనే పని ప్రారంభించాడు.

"వెరీ క్లెవర్ సార్. బాటరీలైటు తీసుకురావడం మంచిపని చేశారు. సమయానికి ఏది ఉపయోగిస్తుందో చెప్పలేం" అన్నాడు త్రివిక్రమరావు.

విష్ణుమూర్తి మొదటిసారిగా కృతజ్ఞతతో దొరైకన్నువేపు చూశాడు.

మెకానిక్ బాగా పని తెలిసిన మనిషి లాగ వున్నాడు. ఎవరితోనూ మాట్లాడ లేదు. వస్తూనే ఆకలితో ఉన్న మనిషి విస్తరాకుమీద పడ్డట్టు కారు మీద పడిపోయాడు. వర్షం ఎక్కువయింది. బాటరీలైటు కాక మరే దీపం వున్నా ఈ సమయంలో ఉపయోగించేదికాదు. విష్ణుమూర్తికి మొదటిసారిగా దొరైకన్ను మంచితనంమీద నమ్మకం కలిగింది.

చెట్టుకి ఆనించిన సైకిలు తీసుకొన్నాడు దొరైకన్ను.

"సెలవిప్పించండి సార్. నమస్కారం," అన్నాడు.


విష్ణుమూర్తి ఆతృతగా "మరి కాస్సేపు ఉండండి. పని మధ్యలో వుంది. బాటరీలైటు–"

"మరేం పరవాలేదు. పని మెల్లగా కానివ్వండి. నాకు దాని అవసరంలేదు. వస్తాను."

"మరి మీకెలా దాన్నివ్వడం?"

"మీ దగ్గర ఉండనివ్వండి. వర్షంగా వుంది. ప్రయాణంలో ముందు మళ్ళీ అవసరం రావచ్చు. ఈసారి మద్రాసు వచ్చినప్పుడు తీసుకుంటాను."

అన్నాడేకాని మద్రాసు అడ్రసు అడగలేదు.




విష్ణుమూర్తికి ఏం చెప్పాలో తెలియలేదు. జేబులోంచి పర్సు తీసి డబ్బు యివ్వబోయాడు. "పోనీ ఇది తీసుకొని మరో కొత్త బ్యాటరీ....".

చెయ్యి దూరంగా తోశాడు దొరైకన్ను.

"ఉపకారానికి ధర కట్టడానికి ఎంత తొందరసార్. నా సహాయం కేవలం 20 రూపాయలేనా?"

సిగ్గుపడ్డాడు విష్ణుమూర్తి. దొరైకన్ను నవ్వి "డబ్బు వద్దు సార్. కాని రేపు దేవుడి దగ్గరకు వెళ్ళినప్పుడు నా గురించి, పాపగురించి – దేవుడి ముందు గుర్తుచేసుకోండి," అని ఆడవాళ్ల వేపు తిరిగి "వస్తానమ్మా" అని నమస్కారంచేసి సైకిలెక్కేశాడు.

"ఎవరండీ ఈ రైతు" అంటున్నాడు త్రివిక్రమరావు. కాని విష్ణుమూర్తి అలాగే నిశ్చలంగా దొరైకన్ను వేపు చూస్తూ నిలబడిపోయాడు. రెండున్నర గంటల క్రితం అతని ఉనికిని గుర్తించటానికికూడా నిరాకరించిన మనస్సు అతని వ్యక్తిత్వానికి అర్ద్రమయిపోయింది.

పార్వతమ్మ నవ్వుతూ అంది. "ఏమండీ. అంత సహాయం చేశాడే– రేపు దేవుడి దగ్గరికి వెళ్ళి చెప్తారా? అతని గురించీ, పాప గురించీను"అంది.

తుళ్ళిపడ్డాడు విష్ణుమూర్తి. అవును. తను గుడికి వెళ్లడంలేదని దొరైకన్నుకి చెప్పడం మరిచిపోయాడు! అయినా తప్పేముంది? దొరైకన్ను మాటవరసకి అని వుంటాడు. ఆ పని భార్య చేసినా పరవాలేదు.

మెకానిక్ చాలా చురుకైనవాడు. మరి రెండు గంటల్లో కారు రెడీ అయింది. విష్ణుమూర్తి యింక స్టీరింగు ముందు కూర్చునే ప్రయత్నం చెయ్యలేదు. మూడు మైళ్ల ముందు – వంతెన మీద నుంచి నీళ్ళు పారుతున్నాయని ఎవరో చెప్పారు. మద్రాసు తిరిగి వెళ్ళిపోవటం మంచిదన్నాడు త్రివిక్రమరావు. "వచ్చిన కష్టాలు చాలు. మరోసారి వద్దాం" అన్నాడు. కాని విష్ణుమూర్తి ఒప్పుకోలేదు. తిరుత్తణి ఊర్లోంచి రైలుపట్టాల పక్కనుంచి – మరో 8 మైళ్ళు చుట్టు తోవ పట్టుకొని తిరుపతి దారిన పడ్డారు.

నాలుగు గంటలసేపు కారులో బాధలు పడ్డాక – తర్వాత ప్రయాణంలో వచ్చిన యిబ్బందులు అంత పెద్దవనిపించలేదు. మధ్యలో గతుకుల్లో పడి ముందుచక్రం హబ్‌కాప్‌పక్కపొలాల్లోకి

జారిపోయింది. బ్యాటరీలైటు వెలుగులో ఎంత వెదికినా దొరకలేదు. రెండుచోట్ల కారులో సీట్లదాకా వచ్చిన నీళ్లలోంచి కారుని తోసుకుంటూ తెల్లవారుఝామున 3 గంటలకి తిరుపతి చేరారు.

మరుసటి వుదయమే అలవాటుగా తన పనిలో నిమగ్నమయిపోయాడు విష్ణుమూర్తి. అనుకున్న ప్రకారం దర్శనం చేసుకువచ్చారు పార్వతమ్మ, త్రివిక్రమరావు దంపతులు. కొండమీదకి విష్ణుమూర్తి వస్తాడని కమలమ్మ ఎన్నడూ అనుకోలేదు. కాని కారు కొండ మీదకి బయలుదేరుతుంటే "దొరైకన్ను పేరిట అయిదురూపాయలు హుండీలో వెయ్యి", అంటూ నోటు తీసి యిచ్చాడు. కమలమ్మ కాస్త ఆశ్చర్యపోయింది, దేవుడిని కూడా గుర్తుంచుకోని మనిషి దొరైకన్నుకి దేవుడి పట్ల గల విశ్వాసాన్ని, నమ్మకాన్ని గుర్తుంచుకొన్నందుకు. ఈ శ్రద్ధ దేవుడి మీద కాకపోవచ్చు. కాని దేవుడిమీద నమ్మకం వున్న వ్యక్తిమీద కావచ్చు.

"పోనీ మీరు రాకూడదూ ఒక్కసారి" అంది పార్వతమ్మ నవ్వుతూ, రాడని తెలిసే.

"మీరు వెళ్లండి. అంతకంటే ముఖ్యమైన పని వుంది" అన్నాడు విష్ణుమూర్తి.

అనుకోకుండా ఒడిదుడుకులయిన యాత్ర–తిరపతిలో సజావుగా సాగినా తిరుగు ప్రయాణంలో మళ్లీ ఈడిగిల పడింది. మర్నాటికి వర్షం తగ్గింది. కానీ, దారిలో ఏర్లు పొంగాయి. దాదాపు సీట్లు మునిగిపోయే నీటిలో పడవలాగ తోసుకుంటూ చెయ్యి సాయం చేసిన కుర్రాళ్లకి డబ్బు చెల్లిస్తూ మళ్లీ తిరుత్తణి దాకా వచ్చారు. కారులో కప్పలు, ముళ్ళ కంచెలు చేరాయి. ఆదినారాయణ చెప్పులు నీటిలో కొట్టుకపోయాయి. ఏమయినా సాయంకాలానికి మద్రాసు చేరుకోవచ్చు ననుకున్నారు. కాని తిరుత్తణికి అటువేపు–చెరువు–వరదలుగా పొంగింది. దాదాపు 100 కార్లు, 80 లారీలు ఆగిపోయాయి. టూరిస్టు బస్సుల ప్రయాణీకులు – అదొక మజిలీ లాగ బస్ టాపుల మీదే స్టౌలతో వంటలు ప్రారంభించారు. చెట్లక్రింద గుంపులుగా మనుషులు చేరారు. నీరు–రెండు లారీల ఎత్తున రోడ్డుకి అడ్డంగా ప్రవహిస్తోంది. అటు మరిన్ని లారీలు, కార్లు. రోడ్డు దాటే ప్రసక్తి లేదు.

ప్రయాణంలో అడ్డంకులు ఎదుర్కొని విష్ణుమూర్తి అలసిపోయాడు. ప్రవాహం ఎప్పటికి తగ్గుతుందో, ఎప్పుడు ప్రయాణం సాధ్యపడుతుందో తెలీదు. ఆలోచించి చాలా మంది పట్టిన మార్గమే పట్టాడు. అక్కడి నుంచి రైలుకట్ట వెంబడే రెండు ఫర్లాంగులు నడిచి తిరుత్తణిలో రైలెక్కి–రాత్రి ఎనిమిది గంటలకి మద్రాసు చేరుకున్నారు.

* * *

ఆ తర్వాత ఎన్నోసార్లు విష్ణుమూర్తి తిరపతి వెళ్లాడు. వెళ్లినప్పుడల్లా దొరైకన్ను, బ్యాటరీలైటూ–దేవుడి పట్ల అతని భక్తీ అన్నీ గుర్తుకొచ్చేవి. ఇదివరకు ఎప్పుడు వచ్చినా కొండమీదకి వెళ్ళి దేవుణ్ని దర్శించుకోవాలనే ఆలోచనైనా మనస్సులో వచ్చేదికాదు. కాని యిప్పుడిప్పుడు తప్పనిసరిగా – దేవుడు మనస్సులో కదలడం ప్రారంభించాడు. అదీ భక్తివల్లకాదు – దొరైకన్ను పట్ల అతనికి ఏర్పడిన సదభిప్రాయం వల్ల. తిరుగు ప్రయాణంలో ఎన్నోసార్లు దారిలో ఆగి–దొరైకన్నుని కలుసుకోవాలని అనిపించేది. కాని కనిపిస్తే "దేవుని దర్శనం చేసుకున్నారా" అని తప్పక అడుగుతాడు. మనసారా అతను చేసిన సహాయానికి ప్రత్యుపకారంగా, అతను చెప్పిన పని చేయలేకపోయిన కించ అతన్ని వెనక్కు లాగేది. ఆ కారణంగానే కారులో ప్రయాణం ఆగకుండానే కొనసాగించేవాడు.

కాని క్రమక్రమంగా తిరుపతి వెళ్లినప్పుడల్లా దేవుడిమీద ఆలోచనా దృష్టి పెరగసాగింది. తిరుపతినుంచి వచ్చినప్పుడల్లా ఏదో తప్పుచేసిన వాడిలాగ బాధపడటం ప్రారంభించాడు విష్ణుమూర్తి. మనస్సులోని ఈ ఆలోచన బయటికి చెప్తే పార్వతమ్మ ఆట పట్టిస్తుందేమోనని చెప్పకుండా దాచేవాడు.

అయిదేళ్ల తర్వాత ఓసారి కలకత్తా నుంచి గంగూలీ అనే మిత్రుడు వచ్చినపుడు–అతను ప్రత్యేకంగా కొండ మీదకి వెళ్లాలన్నపుడు విష్ణుమూర్తి అనవాయితీగా "కారు తీసుకెళ్లండి" అనలేకపోయాడు. మొదటిసారిగా "దండి నేనూ వస్తాను," అన్నాడు.

ఆ ఆలోచనే అతన్ని చాలా ఆనంద పరిచింది. ఓ ప్రాణమిత్రుడి మాట నిలబెట్టుతున్నా నన్న గర్వంలాంటిదేదో మనస్సులో కదిలింది. ఆ సందర్భంలో అతనికి భగవంతుడికంటే, అతనిమీదకి దృష్టిని మరల్చిన దొరైకన్ను మనసులో కదిలాడు–జీవితంలో మొదటిసారిగా కళ్లముందు నిల్చిన స్వామి విగ్రహం ఎంతో ముగ్ధమోహనంగా కనిపించింది విష్ణుమూర్తికి. దొరైకన్ను చిరునవ్వులాగా, ఆప్యాయతలాగ, అతని పలకరింతలో ఆర్ద్రతలాగ–స్వామి సమక్షం అతన్ని పులకితుణ్ణి చేసింది. ఎందుకో దొరైకన్ను నమ్మిన దేవుడిగా స్వామి ఎంతో అందంగా కనిపించాడు. అయిదు సంవత్సరాలుగా మథనపడుతున్న ఒక ప్రశ్నకు సమాధానం దొరికినపుడు మనస్సు శాంతపడింది. ఈ సారి తను దేవుని దర్శనం చేసుకుని వచ్చిన విషయం ఈసారి దారిలో ఆగి–దొరైకన్నుని కలిసి చెప్పాలని మనస్సు ఉవ్విళ్ళూరింది. అందుకని గంగూలీని రైలెక్కించి మధ్యాహ్నమే కారులో

బయలుదేరాడు. కానీ దొరైకన్ను యిల్లెక్కడ? ఎవరిని అడగాలి? పొలాల దగ్గర కారు ఆపి – పొలంగట్టు మీదకి దిగాడు. అయిదేళ్ళ క్రిందటి మాట నిలబెట్టుకున్నానని చెప్పాక దొరైకన్ను ముఖంలో ఆనందం ఉరకలు వేస్తోంది. అటు వెళుతున్న ఎవర్నో అడిగాడు. "దొరైకన్ను ఉండే దెక్కడ?" అతనాగి "యిల్లు దూరం కాని బాబూ, ఈ వేళ ఆ వేపచెట్టు క్రింద పాకలోకి చేరుతాడు. వెళ్ళండి" అన్నాడు.

వేపచెట్టు క్రింద చాలామంది మనుషులు వున్నారు. మాటలు, నవ్వులు వినిపిస్తున్నాయి. ఏదైనా సంత జరుగుతుందేమో అనుకున్నాడు. కానీ, దగ్గరికి వెళ్ళాక కల్లు వాసన గుప్పుమంది. ఆశ్చర్యపోయాడు. దొరైకన్ను తాగటం విష్ణుమూర్తి వూహించలేని విషయం. అయిదేళ్ళ క్రితం తన వూహాపథంలో వున్న దొరైకన్నులోని సాత్వికతకీ యీ కల్లుపాకకీ పొంతన కుదరటంలేదు.

ఇక ముందుకు అడుగు వేయలేక బయటికి వస్తున్న ఆసామికి పేరు చెప్పాడు.

"దొరా! నీ కోసం ఎవరో పెద్ద మనిషి వచ్చాడు." అరిచాడతడు.

పాత మిత్రుడ్ని చూడాలన్న ఉత్సాహం విష్ణుమూర్తి కళ్ళల్లో ప్రతిఫలించింది. ఈ క్షణానికి యింత ఆతృతగా ఎదురుచూస్తున్న విషయం ఈ క్షణం వచ్చేవరకు అతనికే తెలియలేదు.

దొరైకన్ను బయటికి వచ్చాడు. తను చూసినప్పటికంటే బాగా సన్నబడ్డాడు. నల్లబడ్డాడు. బాగా తాగాడేమో తూలుతున్నాడు. కళ్ళు చింతనిప్పుల్లా ఎర్రబడ్డాయి. తదేకంగా విష్ణుమూర్తిని చూశాడు. అతన్ని అస్సలు గుర్తుపట్టలేకపోయాడు.

"ఎవరయ్యా" అన్నాడు తడబడుతూ.

"నేను దొరా! గుర్తులేదూ! అయిదేళ్ళ క్రిందట నా కారు రోడ్డుమీద ఆగిపోతే సాయంచేశావు. బ్యాటరీలైట్ కూడ ఇచ్చావ్. ఇప్పటికీ కారులోనే వుంది."

ఇంకా గుర్తుకందడంలేదు. జ్ఞాపకం చేసుకోవడానికి ప్రయత్నించి వీగిపోయినట్లు అలసటగా ముఖంపెట్టాడు దొరైకన్ను.

"అయితే ఇప్పుడేమంటారు" అన్నాడు. మాటల్లో కొద్దిపాటి నిర్లక్ష్యం కరుకుదనం కన్పించాయి.

విష్ణుమూర్తి మనసు చివుక్కుమంది. ఇతను తనకు తెలిసిన దొరైకన్ను కాదు.

"దొరా! ఆ రోజు నీకు మాటిచ్చాను గుర్తుందా? దేవుడి దగ్గరకెళ్ళి నీ కష్టాలు చెప్పి దణ్ణం పెడతానని. నేను దేవుడి దగ్గరకు ఎప్పుడూ వెళ్ళలేదని నీకారోజు తెలియదు. కాని నిన్ను కలిశాకే దేవుడ్ని చూడాలన్న ఆలోచన కలిగింది. ఆ ఆలోచన ఆచరణలోకి రావడానికి అయిదేళ్ళు పట్టింది. పొద్దుటే దేవుడిదగ్గరకు వెళ్లాను. నీ గురించి నీ కూతురుగురించి మరీ మరీ గుర్తుచేసుకు దణ్ణంపెట్టాను" అన్నాడు.

దొరైకన్ను ముఖం ఎర్రబడింది. ఏదో తెలియని ఆవేశంతో పెదాలు వణికాయి. కళ్ళు మరింత ఎర్రబడ్డాయి. "ఏంటీ, నాకోసం దేవుడిదగ్గర కెళ్లావా? నీ యవ్వ. అసలు దేవుడంటూ ఒకడుంటేగా. ఉంటే నా పాపను బలితీసుకుంటాడా! సిత్తెరి. దేవుడూ లేడు దెయ్యమూ లేదు! ఉన్నదంతా ఒకటే. నేనూ యీ కల్లుకుండా," అంటూ పాకలోకి వెళ్ళిపోయాడు.

నిర్విణ్ణుడై నిలబడిపోయాడు విష్ణుమూర్తి. విష్ణుమూర్తి మనిషిలో దైవత్వానికి తలవంచి దేవుడికి దగ్గరయ్యాడు. దొరైకన్ను దేవుణ్ని నమ్ముకుని పరిస్థితులకు తలవంచలేక దైవత్వాన్ని దూరం చేసుకున్నాడు.

